క్లుప్తంగా

వైద్యాధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

సత్యవేడు : పంచాయతీ పరిధిలోని పల్లాపు వీధిలోని క్లినిక్, మెడికల్ స్టోర్‌ను దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ హర్షవర్ధన్, ఎంపీహెచ్‌ఓ సుబ్రమణ్యం కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. గురువారం సాక్షి దినపత్రికలో ‘కాలం చెల్లిన ఔషధాల పంపిణీ’ వార్తకు మెడికల్ అధికారులు స్పందించారు. కాలం చెల్లిన మందుల విక్రయంపై విచారణ చేపట్టారు. డేట్ పరిశీలించకుండా పొరబాటున మందులు ఇచ్చానని, ఇకపై పొరబాట్లు చేయమని ఆర్‌ఎంపీ సమాధానం ఇచ్చారు. బాధితురాలు శోభారాణిని విచారించి వివరాలు సేకరించారు. తనిఖీ నివేదిక వివరాలను డీఎంహెచ్‌ఓకు పంపుతామని డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 640,15 మంది స్వామి వారిని దర్శించుకోగా 26,786 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.54 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

పీహెచ్‌సీలో ప్రసవాలు పెరగాలి



రికార్డులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ : పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరగాలని రాష్ట్ర వైటల్ స్టాటస్టిక్స్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మృదులరాణి, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్‌తో కలసి ఆయన తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్స్ రికార్డులను, లేబరేటరీలోని సౌకర్యాలను, పరికరాలను, ఫార్మసీ విభాగంలోని మందులను, పరిశీలించారు. ఏఎన్‌ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామ సచివాలయాల వద్దనున్న క్లినిక్‌లలో వైద్యసేవలను సక్రమంగా అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది తమ పని తీరును మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దర్జాగా రేషన్ దందా

- ఆగని అక్రమ రవాణా
- మిల్లర్ల లైసెన్స్ పేరుతో టోకరా
- నకిలీ బిల్లులతో అక్రమ వ్యాపారం
- తమిళనాడు, ఏపీ రేషన్ బియ్యం తరలింపు



నాయుడుపేట వద్ద పట్టుబడిన బియ్యం లారీ



గోదాముల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యం బస్తాలకు గోతాలు మార్చేసి రవాణాకు సిద్ధం చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పేదల నోటి దగ్గరికి చేరాల్సిన రేషన్ బియ్యం సరిహద్దులు దాటిపోతోంది. సూళ్లూరుపేట, తడ ప్రాంతంలో తమిళనాడు, ఆంధ్రా రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ముఖ్యంగా సూళ్లూరుపేట, తడ ప్రాంతాలు తమిళనాడుకు దగ్గరగా ఉండడంతో ఇక్కడ పలు ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకుని ఆంధ్రా, తమిళనాడు రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసుకుని వాటిని గోతాలు మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతంలో ఈ వ్యాపారాన్ని స్థానికంగా ఉన్న కొన్ని రైస్ మిల్లులను కేంద్రంగా చేసుకుని అక్రమ రవాణా సాగించేవారు. దీనివల్ల కలిగిన ఇబ్బందులతో ఈ వ్యాపారాన్ని మిల్లర్లు మానేయడంతో పట్టణంలో లైసెన్స్‌ల పేరుతో అక్రమంగా రేషన్ బియ్యం దందా సాగిస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్

తమిళనాడు రేషన్ దుకాణాల్లో ఇచ్చే ఉప్పుడు బియ్యం, ఏపీలోని రేషన్ దుకాణాల్లో ఇచ్చే ఆంధ్రా బియ్యంను బ్లాక్ మార్కెట్ ద్వారా కొనుగోలు చేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లోని గోదాముల్లో నిల్వ చేసి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ రేషన్ బియ్యానికి గోతాలు మార్చి మామూలు బియ్యం లాగానే బస్తాలను తయారు చేసుకుని ప్రతి రోజు ఇతర ప్రాంతాల్లోని రైస్ మిల్లులకు రవాణా చేస్తున్నారు. దీనికి నకిలీ బిల్లులు తయారు చేసి ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. ప్రతి రోజూ చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వస్తున్న సబర్బన్ రైళ్లో చిన్న చిన్న బస్తాలుగా తయారు చేసి తమిళనాడుకు చెందిన కొంత మంది సూళ్లూరుపేటకు తెస్తున్నారు. ఇక్కడ కొంత మంది చిల్లర వ్యాపారాలు కొనుగోలు చేసి గోదాములో నిల్వ చేసుకుంటున్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న డీలర్లను కూడా మేనేజ్ చేసి రేషన్ బియ్యం బస్తాలను కొనుగోలు చేసి గోతాలు మార్చేసి అక్రమ రవాణా చేసేస్తున్నారు.

కొనుగోళ్లు ఇలా..

తమిళనాడు ప్రాంతం నుంచి చిల్లరగా తెచ్చే రేషన్ బియ్యంను సూళ్లూరుపేటలో కొంత మంది కిలో రూ. 5 నుంచి 9 దాకా కొనుగోలు చేస్తారు. ఇలా రోజుకు సుమారు టన్నుకు పైగా కొనుగోలు చేసి గోతాలు మార్చి కొత్త బస్తాల్లాగా తయారు చేస్తారు. వీటితో పాటు తమిళనాడు పార్సిల్ ఆటోల ద్వారా అక్రమ రేషన్ బియ్యం తెస్తున్నారు. వీరి వద్ద నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి మిల్లర్లకు 15 నుంచి 20 రూపాయలు దాకా అమ్మేస్తారు. మిల్లర్లు ఆ బియ్యానికి పాలిష్ పట్టి మార్కెట్‌లోకి పంపించి కిలో 50 రూపాయల లెక్కన అమ్ముతారు.అదే విధంగానే ఏపీ రేషన్ బియ్యం కూడా ఇదే తరహాలోనే కొనుగోలు చేసి పాలిష్ పట్టి 25 కేజీల బస్తాలో సుమారు 8 కేజీలు దాకా పాలిష్ పట్టిన రేషన్ బియ్యం కలుపుతారు. ఇలా నెల్లూరు, విజయవాడ, మండపేట ప్రాంతాల్లో రైస్ మిల్లులకు తరలించి కోట్ల రూపాయలను ఆర్జిస్తుండడంతో అందరి చూపు ఈ అక్రమ రేషన్ వ్యాపారంపై పడింది. ఈ వ్యాపారంలో ఆదాయ వనరులు పుష్కలంగా ఉండడంతో ఈ వ్యాపారాన్ని లక్షలాది రూపాయలు ముడుపులు పోలీసులు, విజిలెన్స్ వారికిచ్చి సజావుగా నడిపిస్తున్నారు. లైసెన్స్ బియ్యం వ్యాపారం దుకాణం పేరుతో ఈ అక్రమ వ్యాపారం చేస్తుండడం, అందరికీ నెల మామూళ్లు ఇస్తుండడంతో ఈ అక్రమ రవాణా గురించి తెలిసినా అధికారులు, పోలీసులు ఏమీ తెలియనట్టే నటిస్తున్నారు.

ఒకవేళ లారీని పట్టుకున్నా 6ఏ కేసు నమోదు

బియ్యం అక్రమ రవాణాలో పట్టుకున్నా ఆదాయమే. ఎందుకంటే కేసుల కోసం పోలీసులు ఒకటి రెండు లారీలను పట్టుకుంటారు. వాటిపై 6ఏ కేసు నమోదు చేసి నెమ్మదిగా బియ్యం లారీలను రిలీజ్ చేస్తారు. నామమాత్రంగా ఒకరిద్దరు మీద కేసులు పెడతారు. ఈ తంతు బియ్యం అక్రమ వ్యాపారాలు చేసే వారికి అలవాటుగా మారిపోయింది. అందుకే పోలీసులు దాడులు చేసి ఎన్ని లారీల బియ్యం పట్టుకున్నా సరే అక్రమార్కులు ఈ వ్యాపారాన్ని ఆపడం లేదు. ఇందులో ఉన్న లొసుగులను ఔపోసన పట్టేయడంతో అధికారులు కూడా ఏమీ చేయలేక వారి ఇచ్చిన నెల మామూళ్లు తీసుకుని కేసుల కోసం మూడు నెలలకో, ఆరు నెలలకో ఒకటి రెండు లారీలను పట్టుకుని కేసులు పెడుతున్నట్టుగా చేతులు దులుపేసుకుంటున్నారు.

వాటాల కోసం కూటమి నేతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వ్యాపారంలో వాటాలు కావాలని కూటమి నేతలు పట్టుబట్టడంతో కొద్దిరోజులు వ్యాపారాన్ని ఆపేశారు. ఇందులో ఒక బ్యాచ్ ఆపకపోవడంతో వారి లారీలను కూటమి నేతలు పట్టించిన సందర్భాలు ఉన్నాయి. ఆ తరువాత దీనిపై పెద్ద ఎత్తున రాజీ చర్చలు జరిగాయి. ఒక దశలో టీడీపీ అగ్ర నాయకులు దాకా కూడా ఈ వ్యవహారం వెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న బ్యాచ్‌ల మధ్య రాజీ కుదుర్చుకుని కూటమి నేతలకు నెల మామూళ్ల కింద వాటాలు ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకుని అక్రమ వ్యాపారాన్ని దర్జాగా సాగిస్తున్నారు.

విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

డిపోల వద్ద ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



అలిపిరి డిపోలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : కొత్తగా రానున్న విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్యదర్శులు అర్జున్, రమేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల వద్ద ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేపట్టారు. అలిపిరి, తిరుపతి, మంగళం డిపోల్లో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న అర్జున్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లోని పదోన్నతులు వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే డబుల్ డ్యూటీలు చేస్తున్న వారికి డీడీ అమౌంట్ పెంచాలన్నారు. విజయవాడలోని సీసీఎస్ ఆఫీస్‌ను బస్టాండ్‌కు 8 కిలోమీటర్ల దూరానికి మార్పు చేయాలని చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండు చేశారు. ప్రధానంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. డీఏ బకాయిలను చెల్లించకుండా దీర్ఘకాలంగా జాప్యం చేయడాన్ని తప్పుపట్టారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మస్తాన్, ప్రచార కార్యదర్శి సతీష్‌నాయుడు, సత్యనారాయణ, ఆయా డిపోలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే అల్లూరికి దేశభక్తి

- మన్యం వీరుడికి కలెక్టర్, ఎస్పీ నివాళులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

తిరుపతి అర్బన్ : చిన్నతనం నుంచే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు దేశభక్తి ఉండేదని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అల్లూరి 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు జీవితం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలిపారు. 1897 జులై 4న సూర్యనారాయణమ్మ, వెంకటరామరాజు దంపతులకు జన్మించారని, అల్లూరి సీతారామరాజుకు చిన్ననాటి నుంచే దైవభక్తి, దానగుణం, నాయకత్వ లక్షణాలతో విలక్షణమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉండేవారని పేర్కొన్నారు. నిత్యం ధ్యానం, దైవపూజతో జీవనశైలి కొనసాగించిన ఆయన, స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని గుర్తుచేశారు. మన్యం ప్రాంతంలోని గిరిజనుల బాధలను తెలుసుకున్న ఆయన తెల్లదొరల రాజకీయానికి వ్యతిరేకంగా గళమెత్తిన ప్రజల్లో చైతన్యం నింపి, వారికి ధైర్యసాహసాలను కలిగించి పోరాట మార్గాలు నేర్పించారని చెప్పారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్, రోజ్‌మాండ్, సుధారాణి పాల్గొన్నారు.

తిరుపతి క్రైమ్ : స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు.

నేడు ఏపీపీఎస్సీ పరీక్ష

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. ఆయన శుక్రవారం పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం రోడ్డు సత్య ఎన్‌క్లేవ్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 472 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష మూడు సెషన్స్‌లో జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు రెండో సెషన్, అదేవిధంగా సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు మూడో సెషన్ ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఎలక్ట్రికల్ వస్తువులకు అనుమతి లేదని వివరించారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ పరీక్షల అసిస్టెంట్ సెక్రటరీ రాజ్‌గోపాల్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కేవీఎస్ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగళంలోనే విద్యుత్ బస్సుల నిర్వహణ

- డీపీటీవో జగదీష్ వెల్లడి
- మంగళం డిపో పరిశీలన



డిపో అధికారులకు పలు సూచనలిస్తున్న డీపీటీఓ జగదీష్

తిరుపతి అర్బన్ : త్వరలో మంగళం డిపో నుంచే విద్యుత్ బస్సులను నిర్వహించనున్నట్టు డీపీటీవో జగదీష్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాలని సిబ్బంది, అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం డీఎం భాస్కర్‌రావు, ఏడీఎం పద్మావతితో కలిసి మంగళం డిపోను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా అలిపిరి డిపో ఆధ్వర్యంలో 100 విద్యుత్ బస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. త్వరలో జిల్లాకు 50 విద్యుత్ బస్సులు రానున్నాయని తెలిపారు. వాటిని మంగళం డిపో కేంద్రంగా నిర్వహించాలని విజయవాడ నుంచి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నారు. మంగళం డిపో స్థలం విశాలంగా ఉన్నప్పటికీ గుల్లగుల్లగా మారిందని పేర్కొన్నారు. మరోవైపు ఇక్కడ వసతులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని మండిపడ్డారు. కొత్తగా వచ్చే విద్యుత్ బస్సులను ఏ ప్రాంతంలో పార్కింగ్ చేయాలి, ఎన్ని చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలి, ఏ భాగంలో చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది అన్న అంశాలపై చర్చించారు. అలిపిరి డిపోలో రెండు రోజులు పరిశీలించి నిర్వహణపై అవగాహన కలుగుతుందని ఇక్కడి అధికారులు, ఉద్యోగులకు సూచించారు. మంగళం డిపోలోనూ అదే విధమైన విధానాలను అనుసరించవచ్చని చెప్పారు.


సంతృప్తికరంగా ఏడాది పాలన



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ విభాగాల అధికారులు

తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లా కలెక్టర్‌గా వెంకటేశ్వర్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల అవసరాల నేపథ్యంలో పరిపాలన సౌలభ్యం కోసం వైఎస్సార్‌సీపీ సర్కార్ 2022 ఏప్రిల్ 4న జిల్లాల పునర్విభజన చేపట్టి తిరుపతి జిల్లా ఏర్పాటు చేశారు. మొదటి కలెక్టర్‌గా వెంకట రమణారెడ్డి రెండేళ్లపాటు పనిచేశారు.ఆ తర్వాత లక్ష్మీశ నెల రోజులు, అనంతరం ప్రవీణ్‌కుమార్ మూడు నెలలు, అనంతరం వెంకటేశ్వర్ ఏడాది పాటు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్‌లోని ఉద్యోగులు విభాగాల వారీగా శుక్రవారం కలెక్టరేట్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టరేట్‌లోని ఉద్యోగులే కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పలువురు ప్రజా ప్రతినిధులు ఆయనకు ఏడాది పాలనపై శుభాకాంక్షలు తెలిపారు. మొత్తంగా ఏడాదిపాటు తిరుపతి జిల్లా కలెక్టర్‌గా పాలనపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీసిటీని సందర్శించిన సిక్కీ బృందం



శ్రీసిటీని సందర్శించిన సిక్కీ బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : చెన్నైలోని దక్షిణ భారత వాణిజ్య, పరిశ్రమల మండలి (ఎస్ఐసీసీఐ)కి చెందిన 22 మంది ప్రతినిధుల బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు, ఇక్కడ అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతుల అధ్యయనం, పెట్టుబడి అవకాశాల పరిశీలన దిశగా వీరి పర్యటన సాగింది. శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ బృంద సభ్యులకు స్వాగతం పలికారు. చర్చల సందర్భంగా శ్రీసిటీ అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక స్థానం, వ్యాపారానుకూల పర్యావరణ వ్యవస్థకు సంబంధించి వారికి ప్రదర్శన ఇచ్చారు. శ్రీసిటీలో విస్తృత వ్యాపార అవకాశాలు ఉన్నాయని, వాటిని పరిశీలించి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని వారిని కోరారు. ఈ పర్యటనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, దక్షిణ భారతదేశ వ్యాపార స్వరూపాన్ని రూపొందించడంలో సిక్కీ పాత్ర ఎంతో కీలకం, విలువైనదని వ్యాఖ్యానించారు. వివిధ రంగాలలోని ప్రముఖ వ్యాపార సంస్థలు, కన్సల్టెన్సీ సంస్థల ప్రతినిధులతో కూడిన ఈ బృందం పరిశ్రమలను సందర్శించింది. సిక్కీ ప్రాజెక్ట్స్ హెడ్ ఆర్.శరణ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ పర్యటన కొనసాగింది.

ఎర్రచందనం కేసులో ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో తమిళనాడుకు చెందిన వళ్లియన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది 2019లో శేషాచలం అటవీ ప్రాంతం, నాగపట్ల బీట్, చామల రేంజ్ అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. నిందితుడు వళ్లియన్ ఎర్రచందనం దుంగలను తరలించడానికి ప్రయత్నించాడు. ఫారెస్ట్ సిబ్బంది అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఠాణాలోనే దళిత నేతపై దాడి

పెళ్లకూరు : మండలంలోని పునబాక గిరిజన కాలనీకి చెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న దళిత నేత యాగాని బెన్నీపై అదే గ్రామానికి చెందిన కొందరు పోలీస్ స్టేషన్‌లోనే దాడికి పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశం అయ్యింది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు గ్రామంలోని గిరిజన కాలనీకి చెందిన అమాస సాయి కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న బెన్నీపై స్టేషన్‌లోనే నీలం నరసింహులు, రెడ్డి శ్రీనివాస్, సుమన్‌రెడ్డి, తాళ్ల నితిన్, నీలం రాజేష్ తదితరులు దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను మోసగించే అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

- 114 గ్రాముల బంగారం స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి : మహిళలకు మాయమాటలు చెప్పి డబ్బు ఆశ చూపి బంగారు నగలు దొంగలిస్తున్న అంతర్రాష్ట్ర దొంగలను శుక్రవారం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11 లక్షలు విలువ గల 114 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ఇలా.. శ్రీకాళహస్తిలో గత ఏడాదిలో ఓ మహిళను బురిడీ కొట్టించి 58 గ్రాముల బంగారు కొట్టేసిన కేసులో నెల్లూరుకు చెందిన సునీత స్థానిక సచివాలయ ఉద్యోగి ఫిర్యాదు చేయగా వీరిని పట్టుకున్నామన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేస్తూ ఒక బాలున్ని అడ్డం పెట్టుకుని మోసం చేసి డబ్బులు దోచుకోవడం, బంగారు నగలు ఇస్తే డబ్బులు ఇస్తామని తమ వద్ద బంగారు నగలు ఉన్నాయని మీ వద్ద బంగారు ఇస్తే కొత్త బంగారు ఎక్కువ ఇస్తామని మాయమాటలు చెప్పి నగలు, డబ్బులు అపహరిసున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండులో అరెస్టు చేసినట్లు తెలిపారు. మూడు చోరీల్లో దోచుకున్న నగలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన దుమ్మగూడ ప్రాంతంలో నివాసం ఉండే గుజరాతి కిషన్(24), న్యూఢిల్లీ నుంచి వచ్చి మల్కాజ్‌గిరిలో ఉంటున్న ప్లాస్టిక్ పవ్వుల వ్యాపారం చేస్తున్న శ్యామ్‌లా(30)ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు వీరిద్దరిపై తెలంగాణలో 7 కేసులు నమోదు అవ్వడంతో పాటు జైలుశిక్ష కూడా అనుభవించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి, కడప, చిత్తూరులో మూడు కేసులు నమోదు అయ్యాయని చెప్పారు.

ఈఎస్ఐ ఆసుపత్రి తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆంజనేయులు

తిరుపతి తుడా : స్థానిక ఆర్సీరోడ్డులోని ఈఎస్ఐ ఆసుపత్రిని రాష్ట్ర బీమా వైద్యసేవల డైరెక్టర్ ఆంజనేయులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ బ్లాక్, ఫార్మసీ, ఇన్ పేషెంట్స్ వార్డు వంటి విభాగాలను పరిశీలించి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇస్తున్న ట్రీట్మెంట్ విషయాలను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబుతో చర్చించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ నర్సింగ్, పారా మెడికల్ ఉద్యోగులు జీతాల పెంపు, ఉద్యోగ భద్రత, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బంది తమ సమస్యలపై డైరెక్టర్‌కు విన్నవించారు.

పిల్లలను విక్రయిస్తామంటూ మోసం

చంద్రగిరి : పిల్లలను విక్రయిస్తామంటూ నగదు వసూలుకు పాల్పడిన ఘటన శుక్రవారం చంద్రగిరిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. రాముల వారిగుడి వీధికి చెందిన మణికంఠ అనే వ్యక్తి, ఓ ట్రస్టును ఏర్పాటు చేసుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని అందరిలో చలామణి అవుతున్నాడు. అయితే కొద్ది రోజుల క్రితం తిరుపతికి చెందిన పిల్లలు లేని దంపతులకు వాట్సాప్ గ్రూపులో ఓ బాలుడి ఫొటో పంపి ఆ బాలున్ని విక్రయిస్తామంటూ మెసేజ్ చేశాడు. దీంతో పిల్లలు లేని ఆ దంపతులు ఎంతో ఆశపడి బాలుడి కోసం 65 వేల రూపాయలను ఫోన్ పే ద్వారా అతడికి అందజేశారు. రోజులు గడిచే కొద్దీ బాలుడిని అప్పగించకపోవడంతో పలుమార్లు మణికంఠను సంప్రదిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మణికంఠ మోసం చేశాడని గ్రహించి తమ డబ్బును తమకు ఇవ్వాలని కోరారు. దీంతో మణికంఠ డబ్బు ఇచ్చేది లేదంటూ వారిని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో తిరుపతికి చెందిన ఆ దంపతులు మణికంఠ నివాసం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఓ బాలుడు ఆడుకుంటుండగా చూసి ఫొటోలో ఉన్న బాబు ఇతడేనని గుర్తించారు. ఆపై బాలుడు తల్లిదండ్రులను సంప్రదించి మీ బిడ్డను మాకు విక్రయిస్తానంటూ మణికంఠ అనే వ్యక్తి డబ్బులు తీసుకున్నాడని, మరి కొంత మంది పిల్లల ఫొటోలు కూడా, అతని వద్ద ఉన్నాయని, మీరు జాగ్రత్తగా ఉండాలంటూ బాలుడి తల్లిదండ్రులకు సూచించి అక్కడి నుంచి వెనుదిరిగారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయం వివరించి ఫిర్యాదు చేశారు.

మహిళపై లైన్‌మన్ దురుసు ప్రవర్తన



నిండు గర్భిణి అయిన కుమార్తెతో ఇంటి ముందు నిలబడి ఉన్న కుటుంబ సభ్యులు

రేణిగుంట : తన కూతురు గర్భిణిగా ఉండడంతో హాస్పటల్‌లో చూపించుకునే క్రమంలో విద్యుత్ బిల్లు చెల్లింపులో జాప్యం అయిందని లైన్‌మన్‌కు చెబుతుండగా వినకుండా విద్యుత్ స్తంభం ఎక్కి సరఫరాను నిలుపుదల చేశారు. మీరు ఇప్పుడు డబ్బులు చెల్లించినా రెండు రోజుల వరకు సరఫరా చెయ్యము మీకు దిక్కున చోట చెప్పుకోండి ।అంటూ దురుసుగా ప్రవర్తించిన సంఘటన రేణిగుంట మండలంలో చోటుచేసుకుంది. రేణిగుంట మండలం గురవరాజుపల్లి పంచాయతీ, అంబేద్కర్ కాలనీలో కనపర్తి సౌజన్య కొడుకు ఇద్దరు కూతుర్లతో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక లైన్‌మెన్ గోవిందరాజులు విద్యుత్ బిల్లు చెల్లించలేదని సరఫరాను నిలుపుదల చేశారు. దీంతో నిండు గర్భిణీ అయిన కూతురు, కొడుకుతో చిమ్మ చీకటిలో ప్రస్తుతం కాలం వెల్లదీస్తున్నారు. ఆన్‌లైన్‌లో 7 గంటలకు కరెంట్ బిల్లు చెల్లించామని, జేఎల్‌ఎంకు ఫోన్ చేయగా లైన్‌మన్ రెండు రోజుల వరకు కరెంటు ఇవ్వద్దని చెప్పాడని అన్నారు. ఉన్నతాధికారులు దయ ఉంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

గంజాయి ముఠా అరెస్టు

తొట్టంబేడు : శ్రీకాళహస్తి పట్టణంలోని టిడ్కో ఇళ్ల సమీపంలోని పాడుబడ్డ ఇళ్ల వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో బుచ్చినాయుడు కండ్రిగ సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో తొట్టంబేడు మండలం శివనాథపురం గ్రామం వద్ద తచ్చాడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 9.2 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన కోడంబాకం చెందిన రాజేంద్ర సెల్వకుమార్ (22), వడపళనికి చెందిన నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిపై తమిళనాడులో పలు కేసులు ఉన్నట్లు సమాచారం. దీనిపై పూర్తి సమాచారం తీసుకుంటున్నామన్నారు. తొట్టంబేడు ఎస్ఐ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్మీ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన

తిరుపతి సిటీ : స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఇండియన్ ఆర్మీలో ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ, ఆర్మీ అధికారి మేజర్ అమర్‌దీప్ కుమార్ హాజరై సైన్యంలోని పలు విభాగాలలో చేరేందుకు కావలసిన అర్హతలు, జవాన్లకు లభించే ప్రయోజనాలను వివరించారు. మిలిటరీ చేరేందుకు మహిళలకు కావలసిన అర్హతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, ఆర్మీ అధికారులు ఉదయ్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులతో లయన్స్‌క్లబ్ సభ్యులు

పాకాల : మండలంలోని ఇరంగారిపల్లె ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ప్లాటినం లయన్స్ క్లబ్ సభ్యులు రూ.5వేల విలువైన విద్యా సామగ్రిని వితరణగా అందించారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ సభ్యుడు లయన్ జేఎస్ బాలాజీ తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్, సభ్యులు కుప్పుస్వామి నాయుడు, మాధవి, సుకన్య పాల్గొన్నారు.

ఆశా యాప్‌పై అవగాహన అవసరం

తిరుపతి తుడా : ఆశా యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్ తెలిపారు. శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఛత్రప్రకాష్, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

తిరుపతి తుడా : పేదరిక నిర్మూలనే పీ-4 విధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం అమరావతి నుంచి ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం నుంచి కమిషనర్ మౌర్యతోపాటు ఎమ్మెల్యే పాల్గొన్నారు. తిరుపతిలో 6,379 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీరిని ఆదుకునేందుకు సుమారు 700 మంది మార్గదర్శకులు అవసరమని వెల్లడించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మార్గదర్శకుల ఎంపికకు వార్డు కమిటీలు వేసి పదిహేను రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారి సేతు మాధవ్ పాల్గొన్నారు.


నేడు జాతీయ లోక్ అదాలత్



గురునాథ్, న్యాయమూర్తి

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు జాతీయ అదాలత్ నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సివిల్ కేసులు, రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, వివాహ సంబంధ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, ఇతర కేసులను అదాలత్ పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం తొమ్మిది బెంచ్‌లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ బెంచ్‌లకు అధ్యక్షులుగా తనతో పాటు తిరుపతి అదనపు జిల్లా జడ్జిలు అర్చన, రామ్ గోపాల్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయసారధి రాజు, జూనియర్ సివిల్ జడ్జిలు వాణిశ్రీ,సత్య కాంత్ కుమార్, కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంధి శ్రీనివాస్ వ్యవహరిస్తారని తెలిపారు.

మా బిడ్డకు ప్రాణం పోయండి



బాలుడితో తల్లిదండ్రులు

తిరుపతి కల్చరల్ : మెదడులో నీరు చేరి అనారోగ్యంతో బాధపడుతున్న తమ బిడ్డ రవితేజ(2)కు శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం అందించి ప్రాణాలను కాపాడాలని తల్లిదండ్రులు రూప, శ్రీనివాసులు వేడుకున్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కపిలతీర్థం సమీపంలోని అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమ బిడ్డ సెరెబ్రోస్పైనల్ ఫ్లూయిడ్ కారణంగా తీవ్ర అనారోగ్యం బారిన పడినట్లు సీఎంసీ వైద్యులు గుర్తించారన్నారు. ఇందుకు రూ.7 లక్షలు ఖర్చు అవుతుందని, దాతలు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సాయం అందించేందుకు 8247773465 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. మనసున్న వారు స్పందించి తమ బిడ్డకు ప్రాణం పోయాలని విన్నవించారు.

మంత్రముగ్ధం



ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు అద్భుతంగా నృత్యం ప్రదర్శించారు. తాతయ్యగుంట గంగ జాతర నృత్యాలతో పాటు ఆధునిక నాట్యం అభినయించి సభికులను మంత్రముగ్ధం చేశారు. విద్యార్థినుల ప్రతిభను ఐఐటీ అధికారులు ప్రశంసించారు.
- తిరుపతి సిటీ

విన్నపం



ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పలు సంఘాల నేతలతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. పలు ఊర్లలో స్థానికుల ఆందోళనను అర్థం చేసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. కనీసం సమస్యాత్మక గ్రామాల్లో అయినా విలీనం ఆపాలని సూచించారు. నేతలు సాయిలక్ష్మి, అక్బర్, రవి, జయచంద్ర పాల్గొన్నారు. - తిరుపతి అర్బన్


సత్కారం



ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థి, ఎన్‌ఆర్‌ఐ వై.సురేష్‌బాబును శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇదే కళాశాలలో 1983-87 మధ్య సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా చేసి అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా సురేష్‌బాబు స్థిరపడడం ఆనందంగా ఉందన్నారు. అలాగే తన తల్లి గోవిందమ్మ చేతులమీదుగా రూ.2,31,016 చెక్కును అందించారని వెల్లడించారు. - తిరుపతి ఎడ్యుకేషన్

నిరుపయోగం

పాకాల ఎన్‌వీఎన్ పాఠశాలలో రూ.2.5లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ నిరుపయోగంగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడిలో సుమారు 250 మంది విద్యార్థులున్నప్పటికీ పరిశుద్ధ జలం అందించడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. ప్లాంట్‌కు మరమ్మతులు చేయించకుండా మూలన పడేశారని మండిపడుతున్నారు. ప్రధానోపాధ్యాయిని రోహిణి నిత్యం 4 వాటర్ క్యాన్లు తెప్పించి పిల్లల దాహార్తిని తీరుస్తున్నారని వెల్లడిస్తున్నారు. - పాకాల



తూకమేస్తున్నారు!

ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. సూపర్‌సిక్స్ అంటూ ఇప్పటికే చేతులెత్తేసింది. ఇంటికే వస్తున్న రేషన్ సరుకులకు మంగళం పాడేసింది. చౌకదుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితిని కార్డుదారులకు కల్పించింది. చివరకు బియ్యం పంపిణీలోనూ అవకతవకలకు పాల్పడుతోంది. పేదల నోటి కాడ కూడును యథేచ్ఛగా లాగేస్తోంది. శుక్రవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి డీలర్ల సాయంతో సర్కారు సాగిస్తున్న దోపిడీని ప్రజల కళ్లకు కట్టారు. తూకంలో మోసాలను ససాక్ష్యంగా ఎండగట్టారు.

- రేషన్ బియ్యంలోనూ కూటమి కక్కుర్తి
- నోటికాడ కూడు లాగేసుకుంటున్నారంటున్న కార్డుదారులు
- ఎండీయూ వాహనాలున్నప్పుడే బాగుండేదని ఆవేదన
- చౌక దుకాణాల్లో తూకాలపై ఆగ్రహం



రేషన్ దుకాణంలో బియ్యం తూకాల పరిశీలనలో భాగంగా పర్యటిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : పేదలకు అందించే రేషన్ బియ్యంలోనూ కూటమి ప్రభుత్వం కక్కుర్తి పడడం దారుణమని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం తిరుపతి నగరంలోని రేషన్‌షాపులలో ప్రజలకు ఇస్తున్న రేషన్ బియ్యం తూకాలను ఆయన పరిశీలించారు. తూకాల్లో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారు. దీంతో రేషన్ డీలర్లను కార్డుదారులు ప్రశ్నించారు. పేదలను మోసం చేసేందుకు మనసు ఎలా వచ్చిందంటూ నిలదీశారు. ఇకపై ఇనుప డబ్బాలో బియ్యం తూకం వేస్తే సహించమని స్పష్టం చేశారు. అభినయ్‌రెడ్డి వచ్చి మా కళ్లు తెరిపించారని, లేకుంటే ప్రతి నెలా రెండు నుంచి నాలుగు కేజీల బియ్యం నష్టపోయే వాళ్లమని వెల్లడించారు.

ఇది దుర్మార్గం



పేదలకు ఇచ్చే పది, ఇరవై కేజీల బియ్యంలోనూ రెండు నుంచి నాలుగు కేజీలు తక్కువగా తూకం వేసి మోసం చేస్తారా? పేదలకు ఇచ్చే బియ్యంలోనూ కక్కుర్తి పడతారా? సన్న బియ్యం కొనుక్కోలేక రేషన్ బియ్యం తింటుంటే అందులోనూ తక్కువ తూకాలు ఇచ్చి మా కడుపు కొడుతున్నారు. పది కేజీల్లో రెండు కేజీలు తక్కువ ఇచ్చి మోసం చేయడం దుర్మార్గం. వాహనాల్లో ఇంటివద్దకు వచ్చి బియ్యం ఇస్తున్నప్పుడే తూకం సక్రమంగా ఉండేది.

- సుమతి, రాఘవేంద్రనగర్

అన్నీ మోసాలే...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏదో మంచి చేస్తారని నమ్మి ఓట్లు వేసినందుకు అన్నీ మోసాలే తప్ప ఒక మంచి పని చేయడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా మాకు ఇస్తున్న రేషన్ బియ్యం కూడా సక్రమంగా అందించడం లేదు. రెండు నుంచి నాలుగు కేజీల చొప్పున తక్కువ తూకాలు వేసి కొట్టేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారు. పేదవాడి రేషన్ బియ్యం కూడా కొట్టేస్తే ఇక మేం ఎలా బతకాలి.

- కౌసల్య, రాఘవేంద్రనగర్

గతంలో బాగుండేది



ఇంటి వద్దకు వచ్చి ఎండీయూ వాహనాల్లో రేషన్ బియ్యం ఇచ్చేటప్పుడే తూకాలు సక్రమంగా ఉండేవి. 20 కేజీలు బియ్యం తూకం వేస్తేనే రసీదు వచ్చేది. దాంతో ఎటువంటి మోసాలకు తావు లేకుండా లబ్ధిదారులకు రేషన్ అందేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పాత పద్ధతి రేషన్‌షాపులను తిరిగి తీసుకురావడంతో డీలర్ల ఇష్టారాజ్యమైపోయింది. తూకాలు తక్కువగా వేస్తున్నా అడిగేవారే లేరు. అధికారులు కూడా చోద్యం చూస్తున్నారు.

- దివ్య, మాధవనగర్

కళ్లు తెరిపించారు



రేషన్‌షాపుల్లో జరుగుతున్న అక్రమాలను భూమన అభినయ్‌రెడ్డి చూపించి మా కళ్లు తెరిపించారు. రేషన్ బియ్యం తూకాల్లో ఇంత మోసం ఉంటుందని ఎప్పుడు అనుకోలేదు. వారు ఇచ్చింది గుడ్డిగా తీసుకెళ్లడం తప్ప ఎప్పుడూ బియ్యం తూకం గురించి ఆలోచించలేదు. ఇలా కూటమి ప్రభుత్వ వచ్చిన ఏడాది కాలంగా ఎన్ని కిలోలు రేషన్ బియ్యాన్ని మా వద్ద నుంచి నొక్కేశారో తెలియడం లేదు. ఇకపై మేము తూకం సక్రమంగా ఇవ్వకుంటే ఒప్పుకోం.

- రామచంద్రయ్య, జీవకోన

నోటీస్ బోర్డు

- నగరంలో పలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా మంగళం, రాజీవ్ నగర్, కొర్లగుంట, అవిలాల, కేవీ దొడ్డాపురం, కపిలతీర్థం, క్రాంతి నగర్, శివజ్యోతి నగర్, తిరుచానూరు, పాడిపేట, పానకం, ఐ.భాగ్యనగరం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం.
- స్విమ్స్ వద్ద 10వ రోజు ఉదయం 9 గంటలకు స్విమ్స్ కార్మికుల రిలే నిరాహార దీక్ష.
- శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు సీతారామ లక్ష్మణుల ఊరేగింపు.
- శ్రీగోవిందరాజస్వామి ఆలయ అనుబంధమైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు పెరియాళ్వార్‌కు తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు శ్రీగోవిందరాజస్వామివారికి గరుడ వాహనం, శ్రీపెరియాళ్వార్‌కు గజవాహన సేవ.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు 'తిరుపతి జిల్లా కవితా సంకలనం' పుస్తకం ఆవిష్కరణ సభ.
- బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వినియోగదారులకు సైబర్ హైజీన్ ఆన్‌లైన్ మోసాల నివారణ, హక్కులు, ఫిర్యాదు పరిష్కారం విధానాలపై అవగాహన సదస్సు.
- శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్ల పంపిణీ.

నేటితో ముగియనున్న ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో తాత్కాలిక అధ్యాపకులకు పెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు శనివారంతో ముగియనున్నాయి. ఇప్పటి వరకు పలు విభాగాలకు చెందిన 200మంది అకడమిక్ కన్సల్టెంట్లు ఇంటర్వ్యూలకు హాజరై వర్సిటీ అధికారులు, కమిటీ ఎదుట సంబంధిత సబ్జెక్టులపై డెమో ఇచ్చారు. శనివారం మరో 51 మంది అధ్యాపకులు ఇంటర్వ్యూలకు రానున్నారు.

రేపటి నుంచి జ్యేష్టాభిషేకం

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామివారి ఆలయలో ఆదివారం నుంచి 8వ తేదీ వరకు జ్యేష్టాభిషేకం నిర్వహించనున్నారు. తొలి రోజు శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపట్టనున్నారు. రెండో రోజు శాత్తుమొర, ఆస్థానం జరిపించనున్నారు. అనంతరం దేవదేవేరులు మాడవీధుల్లో విహరించనున్నారు. మూడోరోజు తిరుమంజనం, సమర్పణ, కవచ ప్రతిష్ఠతోపాటు స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించనున్నారు.

తాత్కాలిక అధ్యాపకులను కొనసాగించాలని వినతి

తిరుపతి సిటీ : వర్సిటీల్లోని అకడమిక్ కన్సల్టెంట్లు, గెస్ట్ ఫ్యాకల్టీ తదితర తాత్కాలిక అధ్యాపకులను కొనసాగించాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రమణ్యం కోరారు. శుక్రవారం ఈ మేరకు ఉన్నత విద్యామండలి అధికారులు, మంత్రి లోకేష్‌కు వినతి పత్రాలను పంపారు. అనేక విశ్వవిద్యాలయాలలోని కొన్ని విభాగాలు శాశ్వత అధ్యాపకులు లేకపోవడంతో తాత్కాలిక అధ్యాపకులతోనే నడుస్తున్నాయని, వారిని తొలగిస్తే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం హెచ్చరించారు.

రేపే బీసీ ఆత్మగౌరవ సభ

తిరుపతి కల్చరల్ : బీసీల హక్కుల సాధనే లక్ష్యంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఇందిరా మైదానంలో బీసీ ఆత్మగౌరవ భరోసా సభ నిర్వహించనున్నట్లు నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం పెద్దకాపు లేఔట్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 2 గంటలకు చేపట్టే భారీ ర్యాలీలో నాయీ బ్రాహ్మణులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

శెట్టిపల్లి లక్ష్మయ్యకు నివాళి





లక్ష్మయ్య పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న భూమన , అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ నేత, అంకాలమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శెట్టిపల్లి లక్ష్మయ్య అనారోగ్యంతో కన్నుమూశారు. శుక్రవార ఈ మేరకు విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి వెంటనే వారి నివాసానికి వెళ్లి లక్ష్మయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, నేతలు నల్లాని బాబు, రాపూరు ప్రసాద్, హరినాథరెడ్డి, మురళి, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, కోటూరు శశి, ఇరగం అనీల్‌రెడ్డి, మల్లం రవికుమార్‌రెడ్డి, పసుపులేటి సురేష్ పాల్గొన్నారు.

బెదిరిస్తున్నారు.. కాపాడండి

తిరుపతి కల్చరల్ : భవానీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న కృష్ణవేణి అనే మహిళ తన కుమారుడు గోపీనాథ్‌ను వలలో వేసుకుని ఆస్తి కాజేసేందుకు యత్నిస్తోందని బాధితురాలు నాగరత్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు ఎస్పీకార్యాలయాని వచ్చిన నాగరత్న మాట్లాడుతూ వివాహమైన తన కుమారుడికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకునేందుకు సిద్ధ పడిందని ఆరోపించారు. ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తూ భాగవతారిణిగా కష్టపడి సంపాదించిన డబ్బుతో జీవనం సాగిస్తున్నానని, కృష్ణవేణి తన కుమారుడు, బంధువులతో కలిసి తమ ఇంటికి వచ్చి చంపేస్తానని బెదిరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది వరకు ఈస్ట్‌పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారు కృష్ణవేణిని మందలించి పంపేశారని తెలిపారు. అయితే కృష్ణ వేణి అండ్ కో మళ్లీ బెదిరింపులకు దిగుతున్నారని వెల్లడించారు. ఉన్నతాధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు.

ఇష్టారాజ్యంగా చెత్త వేస్తే జరిమానా

తిరుపతి తుడా : నగరంలో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా చెత్త వేస్తే జరిమానా తప్పదని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య హెచ్చరించారు. శుక్రవారం మూడో వార్డులోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రివేళలు, వేకువజామున పలువురు కవర్లలో చెత్త వేస్తున్నారని సిబ్బంది ఫిర్యాదు చేయడంతో కమిషనర్ స్పందించారు. నగరంలో చెత్త కుప్పలు ఉన్నాయని, అధికారులు , సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, రోడ్లు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. వర్షపు నీరు, మురుగు రోడ్లపైకి రాకుండా సజావుగా వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు లలిత, శిల్ప, ఏసీపీ బాలాజీ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.

దాడి చేసినా దిక్కులేదా?

- పచ్చమూక ఆగడాలపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం



పోలీసు స్టేషన్ నుంచి వస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చంద్రగిరి : కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారని, అయినప్పటికీ పోలీసులు ఏమాత్రం స్పందించడం లేదని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. గురువారం రాత్రి దళిత నేత, నరసింగాపురం పంచాయతీ అధ్యక్షుడు మించల ప్రవీణ్ కుమార్‌పై టీడీపీ కార్యకర్త దాడి చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బాధితుడి ప్రవీణ్‌తో కలిసి నేతలు శుక్రవారం చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. వారం వ్యవధిలోనే టీడీపీ నాయకులు చేసిన అరాచకాలను, దాడులను సీఐకు వివరించారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చెవిరెడ్డి అక్రమంగా అరెస్టు చేయించి కూటమి నేతలు రెచ్చిపోతున్నారన్నారు. మండల వ్యాప్తంగా ప్రజాప్రతినిదులు, వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసుకుని భౌతిక దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. తమ వారిని కొట్టి బాధితులపైనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను అమలు చేయలేక, ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడి రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజు వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అగరాల దేవారెడ్డి, భాస్కర్ రెడ్డి, మస్తాన్, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, నిరంజన్ రెడ్డి, వెంకటయ్య, ఆనందయ్య, సూరి, సిద్దిక్‌బాషా పాల్గొన్నారు.

హర్షిత్‌రెడ్డి పరామర్శ

టీడీపీ కార్యకర్త దాడిలో గాయపడిన ప్రవీణ్‌ను హర్షిత్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. దాడి జరిగిన తీరును తెలుసుకున్నారు. పచ్చమూక ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొందామని, ఎల్లప్పుడూ తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికే 'ఓపెన్ ఫోరమ్'



సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రజా సమస్యల పరిష్కారానికే టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఓపెన్ ఫోరమ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఖాదీ కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఇళ్లు కోల్పోయిన బాధితులు వినతి పత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే ఓపెన్ ఫోరమ్‌లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రణాళిక విభాగం అనుమతులు లేనిదే భవన నిర్మాణాలు సాగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాడ్ ఏజెన్సీల బకాయిల వసూలుపై దృష్టి సారించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అజరామరుడు అల్లూరి

ఎస్పీజేఎన్ఎం హైస్కూల్‌లో..



పుష్పాంజలి ఘటిస్తున్న నేతలు





అన్నమాచార్య కళామందిరంలో..

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు అల్లూరి అని పలువురు వక్తలు కొనియాడారు. సాయుధ పోరాటంతో తెల్లదొరలకు సింహస్వప్నంగా మారిన అజరామరులని కీర్తించారు. ఆయన చిత్రపటాలకు విశేష పూజలు నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. - తిరుపతి కల్చరల్/ తిరుపతి ఎడ్యుకేషన్/ తిరుపతి క్రైమ్